

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(గత సంచిక తరువాయి)

"**నేను కదిలిన ట్రెయిన్** ఎక్కే హడావుడి, వెహికల్ సౌండ్, ఆ తర్వాత ట్రైయిన్ సౌండ్‌లలో నాకు సెల్ రింగ్ అవ్వటం వినపడనేలేదు. ఈ క్షణం వరకు, నీకు చేశాను ఒకసారి, అంతే ఫోన్‌ను కాల్స్ కోసం చెక్ చెయ్యనే లేదు" అంటూ సెల్ చేతిలోకి తీసుకుని చూశాడు. ఇదుగో, ఇపుడు వచ్చిన ఫోన్ నుంచే మూడు కాల్స్ ఉన్నాయి. ఇవి నా లత చేసిందన్నమాట" అంటూ సెల్ మంచం మీద పడేసి, అల్మారా పక్కగా పెట్టి ఉన్న లత బ్యాగ్‌ల దగ్గరకు వెళ్ళాడు హేమంత్. వాటిని తెచ్చి సోఫా ఎదుట ఉన్న టీపాయ్ మీద పెట్టి,

"ఇవేరా లత లగేజ్" అన్నాడు.

అందులో ఒకటి కాస్త చిన్నగా ఉన్నది, రెండవది పెద్దగా ఉన్న ఎయిర్ బ్యాగ్.

జిప్ తీసి ఆత్రంగా వెతుకుతున్న హేమంత్‌ను

"ఏం వెతుకుతున్నావ్ హేమంత్?" అని అడిగాడూ అరుణ్.

"ఆ ఫోన్ చేసిన వ్యక్తి చెప్పాడుగా, ఫోన్ కలవలేదని చెప్పిందనీ ఆ తర్వాత ఏదో రాసుకుంటూ కూర్చుందీ అనీ. ఏం రాసిందో పాపం" అంటూ చిన్న బ్యాగ్‌లో ఉన్న వస్తువులను ఒక్కొటొక్కటిగా తీసి బయటపెట్టాడు.

చిన్న దంతం నగిషీ ఉన్న బాక్స్ ఉంది. దాని మూత తెరిచి చూసాడతడు. దాని నిండా బంగారు ఆభరణాలున్నాయి. ఆత్రంగా వాటిని తీసి పరిశీలించిన హేమంత్ మనసు కొంచెం ఊరట చెందింది. వివాహానికి నిదర్శనాలైన వేమీ లేవు అందులో. అదే బ్యాగ్‌లో ఆస్తిపాస్తులకు సంబంధించిన పత్రాలు చాలా ఉన్నాయి. వాటిని తిరిగి పెట్టేస్తుంటే, ఒక మడత పెట్టిన తెల్లకాగితం కనిపించింది.

దానిని తొందరగా తెరిచి చూశాడతడు.

అమ్మా లతా, నీ మామయ్య అంటే నా తమ్ముడు పరమ దుర్మార్గుడు. ప్రతి పక్షంతో కూడి, వాళ్ళను గెలిపించటం కోసం నాన్నగార్ని హత్య చేయించిన కసాయి వాడు. ఆస్తులన్నింటిని కబళించటం కోసం, నిన్ను వాడి కొడుకుకు ఇచ్చి పెళ్ళి చెయ్యాలన్న దురుద్దేశంతో ఉన్నాడు .

"అమ్మా లతా, నీ మామయ్య అంటే నా తమ్ముడు పరమ దుర్మార్గుడు ప్రతిపక్షంతో కూడి, వాళ్ళను గెలిపించటం కోసం నాన్నగార్ని హత్య చేయించిన కసాయివాడు. ఆస్తులన్నింటిని కబళించటం కోసం, నిన్ను వాడి కొడుకుకి ఇచ్చి పెళ్ళి చెయ్యాలన్న దురుద్దేశంతో ఉన్నాడు . వాడి కొడుకు ఒక హత్యకేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. వాడిని లండన్‌లో ఉద్యోగం అని, డాక్టర్ అనీ ప్రచారం చేస్తున్నాడు. వాడి కుట్రలు నేను తెలుసుకున్నానని గమనించి మనిద్దర్నీ కలవకుండా చేస్తున్నాడు. మీ నాన్నగారి మరణంతో నాకు మతి చెలించిందనీ, పిచ్చాసుపత్రిలో ఉన్నాననీ చెప్తున్నాడని నాకు తెలిసింది. నన్ను ఒక మారు మూల గదిలో బంధించాడు. మన వంటమనిషి మాణిక్యం ద్వారా ఇంకా చాలా విషయాలు తెలుస్తున్నాయి. నా ప్రాణానికి నమ్మకంలేదు. చంపేస్తాడు.

నీ నగలు, ఆస్తుల పత్రాలు, ఇందులో పట్టినంత సొమ్ము, ఈ బ్యాగ్‌లో పెట్టాను. ఇది నీకు ఎలాగైనా చేరుస్తాను. నువ్వు ఎలా వున్నావో కూడా తెలియటంలేదు. మాణిక్యం మన మనిషి, ఇంకెవరినీ నమ్మకు.

నువ్వు ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి. అదే నా ఆరాటం. నా ఆరోగ్యం కూడా ఏం బాగోలేదు. నా గురించి ఆలోచించకు. నేను జీవితాన్ని చూసేసాను. నువ్వు ఇంకా జీవితాన్ని చవిచూడలేదమ్మా. నిన్ను చాలా మంచి వ్యక్తికి ఇచ్చి వివాహం చెయ్యాలన్న మా కల కల్ల కాకూడదు.

నిన్ను అప్పుడు కర్నూలుకు తీసుకు వచ్చాడూ హేమంత్ అన్న అబ్బాయి. చాలా మంచి వ్యక్తిలా అనిపించాడు. మీరిద్దరూ పరస్పరం ఇష్టపడుతున్నారని గ్రహించాను. నువ్వు హేమంత్ దగ్గరకు వెళ్ళిపో. అతడే నీకు రక్ష."

**అమ్మ.**

చివరి వరకు చదివి అరుణ్‌కు ఇచ్చి, తల చేతులతో పట్టుకుని కూర్చున్నాడు హేమంత్. అతడు ఉలిక్కిపడి లేచాడు.

బ్యాగ్‌లో వున్న మరో పెద్ద కవర్‌ను తీశాడు. దానినిండా నోట్ల కట్టలు లెక్కకు మించి ఉన్నాయి. అన్నింటినీ తిరిగి సర్ది జిప్ వేసి అల్మారా పెట్టేసాడు బ్యాగ్‌ను.

రెండో బ్యాగ్‌ను ఓపెన్ చేశాడు. అందులో ఒక వాటర్ బాటిల్, టవల్, నాలుగు చీరలు, డ్రెస్‌లూ ఉన్నాయి.

"మరి లత ఏమో రాసుకుంది బుక్‌లో అన్నాడతడు.

అదేం కనిపించలేదు. లత ఏం రాసింది? ఎక్కడ పెట్టింది?" అంటూ బ్యాగ్‌ను దులుపుతున్న హేమంత్‌కు లోపల ఒక జిప్‌లో ఉన్న ఒక బుక్ లాంటిది చేతికి తగిలింది.

ఓపెన్ చేసి ఆత్రంగా తీశాడు హేమంత్.

అదొక డైరీ. మొదటి పేజీలో రెండు సంపంగి పూలు గుత్తిగా ఉన్నాయి. వాటిమీద అందంగా 'హేమ్', 'లత' అని రాసి వుంది. ఆ పూలను లతే అందంగా పెయింట్ చేసిందనిపించింది హేమంత్‌కు.

ఒక్క క్షణం దానిని గుండెకు హత్తుకున్నాడు "లతా" అంటూ.

"ఇది డేట్లు వారీగా రాయలేదురా. ఏదో పాత డైరీ. దానిని జస్ట్ ఒక పుస్తకంలా వాడింది. అంతే. అసలు ట్రయిన్‌లో రాసింది ఎక్కడుంది?" అంటూ డైరీ పేజీలను అటూ ఇటూ కంగారుగా తిప్పి చూస్తున్న హేమంత్ వైపు భయంగా చూసాడు అరుణ్.

'ఎంతో కష్టపడి హేమంత్‌ను మళ్ళీ మనిషిని చేసుకుని కాపాడుకున్నాడు తను. తిరిగి ఇపుడు లత ప్రవేశం వల్ల అతడి మనసు గాయపడకుండా కాపాడు దేవుడా!' అతడు మనసులో దేవుడిని వేడుకున్నాడు.

"ఆ, ఇదిగోరా ఇక్కడుంది" బిగ్గరగా ఉద్వేగంతో అన్నాడు హేమంత్.

డైరీలో నుంచి ఒక కవరు జారి నేలపై పడింది. అరుణ్ లేచి తీశాడు దానిని. దానిని చటుక్కున టీపాయ్ పై ఉన్న మ్యాగ్‌జైన్ క్రింద పెట్టాడు, 'అదేంటో మళ్ళీ అది చూసి ఎక్కడికో వెళ్ళిపోయి ఆలోచించి బాధపడతాడు' అనుకుంటూ.

లత్ అరాసిన లెటర్ పైకి చదవటం మొదలు పెట్టాడు హేమంత్. "నువ్వూ వినరా. ఫోన్‌కు కూడా పలుకని ఈ దుర్మార్గుడి కోసం రాసిన మాటలివి."

"పైకెందుకురా హేమంత్? నీవే చదువుకో" అన్నాడు అరుణ్.

"నీకు అన్నీ తెలుసు కదరా మా గురించి .మా బాధకు, బంధానికీ నువ్వే కదరా సాక్షివి. నా జీవితంలో నీది ప్రత్యేక స్థానంరా" ఇబ్బందిగా చూశాడు అరుణ్.

చదవటం ప్రారంభించాడు హేమంత్.

"హేమ్, ఎందుకిలా అయిందో తెలియటంలేదు. నా సెల్ పోయింది. నా దగ్గర లేదు. ఎంతో కష్టపడి అవకాశం దొరికినపుడు చేశాను కొన్నిసార్లు. అసలు నీ సెల్ అంతకాలం పలుకకుండా ఉంది ఎందుకు? వెళ్ళేటపుడు త్వరగా వస్తానని చెప్పావు. పిచ్చిదానిలా నీకోసం ఎదురు చూడటం తప్ప నేనేం చెయ్యగలను? నేను ఏమైపోతాననుకున్నావ్ హేమ్. నేను ఏమైపోయానో నాకే తెలియటంలేదు. ఏనాటికైనా నిన్ను చూస్తానన్న ఆశతో బ్రతికి ఉన్నాను.

నాకు స్నేహితులు లేరు. ఆ బంధం నువ్వే వేశావు. అమ్మా, నాన్నగారూ, నేను అంతే. ఇక ఏ బంధాలు తెలియవు నాకు. అటువంటి నా జీవితంలోకి ఎడారిపై కురిసిన చిరుజల్లులా ప్రవేశించావ్. నా జీవితాన్ని నీ చుట్టూ అల్లుకున్నాను. కాని విధి నిర్దయగా నన్ను నీకు దూరంగా విసిరేసింది.

నిన్ను చూడాలి, నిన్ను చేరాలి అన్న తపనతో ఎన్నో అడ్డంకులను దాటుకుని, ఎన్నో కష్టాలను ఎదుర్కొని, ఈ ట్రైన్ ఎక్కగలిగాను. ట్రయిన్ పరిగెడుతుంటే, నేను నీకు చేరువ అవుతున్నానన్న పిచ్చి సంబరం హేమ్.

నిన్ను కలవగలనో లేదో తెలియదు. నా హెల్త్ బాగుండలేదు హేమ్. నీకు గుర్తుందా.. వెన్నెలలో నీ ఒడిలోకి చేరి తాజ్‌మహల్‌ను చూద్దామా అని అడిగాను. హేమ్ గుర్తుందా నీకు.. బీచ్‌లో సెల్‌లో నుంచి నాకు ఈ పాటను వినిపించావు.. 'జొవాదా కియా ఓ నిభానా పడేగా' ఈ పాటను నీ గుండెపై వాలి విన్నాను... ఏడుపొస్తుంది హేమ్.

నీ దగ్గరకు చేరాలి. నిన్ను తనివితీరా చూసుకోవాలి ఈ కళ్ళతో. ఒకవేళ నేను చేరలేకపోతే ఈ అక్షరాలనైనా నీ కళ్ళు చదవాలి.

ఇంతే.. నన్ను క్షమించు హేమ్ ఇక రాయలేను. నా ఫోన్‌ను కూడా నీకు చేరనియ్యలేదు విధి! అలా అయినా నీ మాటలు వినగలిగేదాన్ని.

**నీ లత.**

"హేమంత్" గట్టిగా పిలిచాడు అరుణ్.

ఉలిక్కిపడి చుసి షర్ట్ స్లీవ్‌తో కళ్ళు ఒత్తుకున్నాడు హేమంత్.

"లత ఎన్ని బాధలు పడిందో" అంటూ.

"అదంతా గడిచిపోయిన గతంరా. లత నీ దగ్గరకు చేరిపోయింది కదరా. ఇక బాధపడకు. మీ ఇద్దరి కోసం మంచి భవిష్యత్ ఎదురు చూస్తోంది హేమంత్. లే ముఖం కడుక్కో కాస్త. సుమ ఫోన్ చేసిందిరా! ఇంటికి వెళ్దాం ఒకసారి" అంటూ హేమంత్ చెయ్యి పట్టుకుని లేపాడు.

వాష్ రూంలోకి వెళ్ళాడు హేమంత్. 'హమ్మయ్య ' అనుకున్నాడు అరుణ్.

అతడు వెంటనే భార్య సుమకు ఫోన్ చేశాడు, "హేమంత్, నేనూ వస్తున్నాం. తనకు ఇష్టమైన స్నాక్స్ చెయ్యి సుమా" అంటూ.

"అలాగే" అంది ఆమె.

హేమంత్‌కు వద్దు అన్నా వినకుండా బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ శ్రద్ధగా ప్రిపేర్ చేసి పంపిస్తుంది సుమ.

మౌనంగా డ్రెస్ చేసుకుని,తల దువ్వుకుంటున్న హేమంత్ వైపు చూసి, చిన్నగా సెల్‌లో 'బర్‌సావో మేరా మెహబూబ్ ఆయా హై..' సాంగ్ రన్ అవుతుంది.

"ఏరా అరుణ్, టైమ్లీగా ప్లే చేస్తున్నావా?" అడిగాడు హేమంత్.

"కాదురా బాబూ, ఇది రేడియో, రఫీ సాంగ్స్ స్టేషన్" అన్నాడు.

"రక్తసంబంధం, స్నేహబంధాలకంటే అతీతమైందిరా అరుణ్ మన బంధం" అంటూ.

"మరి ఈ బంధానికి ఏం పేరు లేదా సార్?" డోర్ లాక్ చేస్తూ చిలిపిగా అడిగాడు అరుణ్.

"ఏమో, అడగాలి మరి" అన్నాడు హేమంత్.

"ఎవర్ని?"

"లత ఇలాగే అనేదిరా 'మీరు అర్థంకారు ' అని."

కారు ఆపగనే సుమ వచ్చింది గేటు దగ్గరకు.

ఆ వెనుకే అశ్విన్ పరుగున వచ్చాడు "డాడీ" అంటూ.

అరుణ్, అశ్విన్‌ను ఎత్తుకున్నాడు.

"రండి, అన్నయ్యా" అంటూ లోపలకు నడిచింది సుమ.

"డాడీ, నాకు కారు తెస్తానన్నావ్ ఏదీ?" బుంగమూతి పెట్టాడు అశ్విన్.

"అదుగో కారు.అందులోనే వచ్చాంగా, తీసుకో" అన్నాడు అరుణ్.

నవ్వేశాడు అశ్వి, "పోనీ రేపు తెస్తావా?" అంటూ.

"నీకు ఏ రంగు కారు కావాలో క్రేయాన్స్‌తో డ్రాయింగ్ బుక్‌లో వేసి తీసుకురా అస్సూ" అన్నాడు అరుణ్.

"ఓకె డాడీ" అంటూ పరుగున వెళ్ళిపోయాడు అశ్విన్. స్నాక్స్ ప్లేట్లు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది సుమ.

"ఎందుకమ్మా, ఇన్ని రకాలు చేశావ్ శ్రమపడి?" అన్నాడు హేమంత్.

"అన్నయ్యా వదిన బాగున్నారని చెప్పాడు అరుణ్. చాలా హ్యాపీగా వుంది."

"బాగానే ఉందమ్మా. థ్యాంక్స్" అన్నాడు హేమంత్.

అరుణ్ చూపులతోనే సుమను వారించాడు. ఆమెకు అర్థమైంది.

"పకోడి, బజ్జీ, చిప్స్ బాగా చేశావ్. సాస్ ఏది సుమా?" అడిగాడు అరుణ్.

తొందరగా వెళ్ళి ఫ్రిజ్‌లోంచి సాస్ బాటిల్ తెచ్చింది ఆమె.

"క్యాంటిన్ ఉంది కదమ్మా. నువ్వు కష్టపడి ఏం పంపించకు" అన్నాడు హేమంత్.

"అయ్యో ఇదేం శ్రమ అన్నయ్యా, మీ చెల్లే ఉంటే ఇంకా బాగా చూసుకునేది మిమ్మల్ని .నేను అంతగా ఏం చెయ్యటం లేదు" అంటు కొంగుతో కళ్ళు ఒత్తుకుంది సుమ.

ఇబ్బందిగా చూశాడు హేమంత్ "అయ్యో బాధపడకమ్మా" అంటూ

"అరుణ్ ఎలాగో కష్టపడి చదివి, మీ సాయంతో డాక్టరై బయటకు వచ్చాడు. కాని దిక్కుతోచక ఉన్న సమయంలో మీరు ఆదుకుని మాకు ఇంత జీవితాన్ని ఇచ్చారు. నిశ్చింతగా బ్రతుకుతున్నాం మీ నీడన. మీరు, వదిన చల్లగా ఉండాలి" తినటం పూర్తిచేసి లేచిన హేమంత్ పాదాలు తాకుతూ అంది సుమ.

కంగారుగా లేవదీశాడు హేమంత్ "అయ్యో లే అమ్మా. ఎవరూ లేక ఒక అనాథగా మిగిలిన నాకు మీరిద్దరూ నా కుటుంబం అయి మనశ్శాంతి నిచ్చారు. తుఫాను గాలికి కొట్టుకుపోయి ఒంటరి పక్షిలా మిగిలిపోయిన నాకు, మేము ఉన్నాం అని కంటికి రెప్పలా కాపాడి నిలబెట్టారు నన్ను. ఇలా ఉన్నాను అంటే మీ ఇద్దరి ప్రేమే కారణం అమ్మా" అన్నాడు.

అరుణ్‌ను ఒక చేత్తో, సుమను ఒక చేత్తో దగ్గరకు తీసుకున్నాడు. ముగ్గురి మనసులూ స్పందించి కళ్ళు చెమ్మగిల్లాయి.

హేమంత్, అరుణ్‌లు ఇద్దరూ తిరిగి హాస్పిటల్‌కు చేరుకున్నారు.

"అరుణ్, ఒకసారి లతను చూద్దాం రా" అన్నాడూ హేమంత్.

ఇద్దరూ లత బెడ్ దగ్గరకు వెళ్ళారు.

సిస్టర్ వచ్చింది హేమంత్ దగ్గరకు.

"ఆవిడ పూర్తిగా తెలివిలోకి రాలేదు సార్. కాని..కాని" అంటూ ఆగిపోయింది హేమంత్ వైపు ఇబ్బందిగా చూస్తూ.

"కాని.. ఏంటి సిస్టర్" అంటున్న హేమంత్, లత వైపు చూశాడు.

"హేమ్...హేమ్" లత పెదవులనుండి తన పేరు వినిపించటంతో అతడు ఉద్వేగనికి లోనయ్యాడు.

"సార్.. ఆమె అలాగే పలవరిస్తున్నారు సార్ మధ్యాహ్నం నుంచి" హేమంత్ బాధగా మూలిగాడు "మైగాడ్" అంటూ.

నెమ్మదిగా ఆమె తల నిమిరి, తలుపు తీసుకుని బయటకు వెళ్ళిపోయాడతడు.

హేమంత్ తన రూముకు వెళ్ళిపోయి, షూస్ తీసేసి బెడ్‌పై వాలిపోయాడు.

'నిన్ను ఆ రాక్షసుల నుంచి కాపాడుకోలేని ఈ అసమర్థుడి కోసమా కలవరిస్తున్నావు. లతా" అంటూ అశాంతిగా నుదుటిపై చేత్తో రాసుకుంటున్నాడు అతడు.

అతడి వెనుకే వచ్చిన అరుణ్ హేమంత్ దగ్గరగా వెళ్ళి చూశాడు. అతడి స్థితి అర్థమైంది అరుణ్‌కు.

"హేమంత్, నువ్వు రెస్ట్ తీసుకో. నేను చూసుకుంటానులే పేషెంట్లను" అన్నాడు.

అతడి వైపు చూడకుండానే,

"అలాగే" అన్నాడు.

"నేను లతను నువ్వు చూసేలా నెమ్మదిగా ప్రిపేర్ చేస్తాను. స్పృహలేని స్థితిలో నీకోసం తపిస్తుంది. ఇక కాన్షస్‌లోకి వచ్చాక నన్ను బతకనిస్తుందా నిన్ను చూపకపోతే"

"అలాగేలేరా థాంక్యూ" అన్నాడు వెనక్కి తిరిగి పడుకుంటూ. కాసేపు అతడివైపు అలాగే చూసి నిట్టూర్చి, నెమ్మదిగా డోర్ దగ్గరకు లాగి వెళ్ళిపోయాడు అరుణ్.

నెమ్మదిగా లేచి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి సోఫాలో చేర్లబడ్డాడు హేమంత్.

సడన్‌గా అతడికి లత డైరీ గుర్తుకు వచ్చింది. ఒక్క ఉదుటున లేచి వెళ్ళి అల్మారాలో పెట్టిన డైరీ తెచ్చాడు. వెళ్ళి సోఫాలో దిండుపై తలపెట్టుకుని పడుకున్నాడు.

మొదటి పేజీలో ఉన్న సంపంగి పూల పెయింటింగ్‌ను పెదవులతో తాకాడు "లతా!" అంటు.

ఒకటి తర్వాత ఒకటిగా పేజీలను తిప్పుతున్న హేమంత్‌కు రెండు నెమలి కన్నులు జారి గుండెపై పడ్డాయి.

"లతా... తాకితే కందిపోయేటంత సౌందర్యం నీది.ఎన్ని బాధలను ఎదుర్కొని నాకోసం బయ్యేదరావో అతడి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఈ నెమలి కన్నులకు, నీ పెదవులను తాకే అదృష్టం కలిగే ఉంటుంది సుమా" అంటూ వాటిని మృదువుగా పెదవులతో స్పృశించి గుండెపై ఉంచుకున్నాడు.

పేజీలను తిప్పుతున్న అతడి వేళ్ళు ఒకచోట ఆగాయి.

'హేమ్, ప్లీజ్ వెంటనే వచ్చి నన్ను తీసుకుపో. ఒకటే సెంటెన్స్ పెద్ద అక్షరాలతో రాసి ఉంది. అతడి గుండె వేగంగా స్పందించింది.

మరో పేజీ తిప్పాడు.

'హేమ్ అలా ఎలా ఉండగలుగుతున్నావు? ఎన్ని బాటలు వేసుకున్నాం భవిష్యత్తులోకి.

'ఎన్ని బాసలు చేసుకున్నాం 'మన' జీవితంలోకి అడుగులు వేస్తూ? నీకు ఒక్కటంటే ఒక్కటీ గుర్తుకు రావటంలేదా?

"ఎందుకిలా మౌనం వహించావ్? చనిపోవాలనిపిస్తుంది.కాని మరుక్షణమే అనిపిస్తుంది, నువ్వు తప్పక నాకోసం వస్తావని. నేను లేకపోతే నీ మనసెంత బాధపడిపోతుంది? అందుకే బ్రతుకుతున్నా ఈ నరకంలో.'

'హేమ్ నువ్వు లేక సెకన్లు, నిముషాలు, గంటలు, రోజులు, నెలలు సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అయినా నా ఆశ చనిపోవటంలేదు! ప్లీజ్ తొందరగారా.'

అక్షరాలు మసకగా కనిపిస్తుంటే షర్ట్ చేతితో కళ్ళు ఒత్తుకున్నాడు.

ఎగిసి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ, పేజీలను తిప్పుతూనే ఉన్నాయి అతడి వేళ్ళు.

"ఈ రోజు 'మన' బర్త్‌డే హేమ్. నువ్వు ఇచ్చిన లాకెట్ చైన్‌ను వేసుకున్నాను. అదైనా నా గుండెకు దగ్గరగా ఉంటుందని.'

'ఒకసారి నేను పది నిమిషాలు లేట్‌గా వచ్చాను చెప్పిన టైమ్ కన్నా. అప్పుడు నువ్వు ఏమన్నావ్?

'లతా జీవితం చాలా చిన్నది. ఒక్కో రోజు గడిచిన కొలదీ అది ఇంకా చిన్నగా.. ఇంకా చిన్నగా అయిపోతూ వుంటుంది. అందుకు ప్రతిక్షణం విలువైనదే' అన్నావు.

'హేమ్, అటువంటి సున్నితమైన ఆలోచనలు ఉన్న నువ్వు, నన్నెందుకు ఇలా ఏడిపిస్తున్నావ్?'

'ఈ అశోకవనంలాంటి నా మనసులో, ప్రతి జ్ఞాపకం ఒక రాక్షసి అయి పీక్కుతింటున్నాయి. ప్లీజ్ రావా!'

అక్కడ ఆగిన అతడి వేళ్ళు, ఆత్రంగా మరొక పేజీని తిప్పాయి.

'ఈ రోజు ఫ్రెండ్‌షిప్ డే అన్నావు ఒకరోజున. నాకు పెద్దగా ఫ్రెండ్స్ అంటూ ఎవరూ లేరు. కాని ఇపుడు అర్థమవుతుంది. మనిషి కనుక్కున్నది ఆక్సిజన్ మాత్రమేనని. హేమ్, ప్రాణముందనీ, అది సిలెండర్లలో పట్టి కొనుక్కోవటానికి దొరకదనీ అనిపిస్తుంది ఇపుడు. అది దానంతట అదే పుట్టి పెరిగి మనసులో మరొక మనసును అల్లుకుంటుందనీ. ఆ బంధం ఏ మాత్రం దెబ్బ తిన్నా, జీవితం ఒక మొక్కలాగే వాడిపోతుంది అనీ.'

నువ్వు ఒక ముత్యాల బ్రేస్‌లేస్ను నా చేతికి వేసావు గుర్తుందిగా. ఎలా మర్చిపోతవులే..'

'పిచ్చిదానిలా తోచినదల్లా రాస్తున్నాను నీ స్పందన లేకున్నా. మనసు మరోవైపు భయపెడుతుంది. నీ ఆరోగ్యం ఎలా వుందో, లేక అమ్మా, నాన్న ఎలా ఉన్నారోనని.'

మరొక పేజీ..

బైక్ మీద సింహాచలం తీసుకువెళ్ళావు గుర్తుందా? అక్కడ దోసెడు పసుపు రంగు సంపంగి పూలను తెచ్చి నా దోసిలిలో వేశావు "ఇవిగో నీ ఫ్రెండ్స్" అంటూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS